# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 27 ఆదివారం 28, సెప్టెంబర్ 2025 పేజీలు: 09 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## సర్కారు తప్పిదంతోనే మెట్రో భారం!

లోపభూయిష్టంగా మెట్రో విస్తరణ ప్రాజెక్టు డీపీఆర్

వాటిపై స్పష్టత ఇవ్వకుండా రేవంత్ ప్రభుత్వం కాలయాపన

2100 కోట్ల అప్పు ఇస్తే ఆర్థిక ఊరటతో దారికి రానున్న కంపెనీ

20 ఏండ్ల తర్వాత మెట్రోతోపాటు భూములూ సర్కారుకు!

ముందుచూపు లేకుండానే రూ.43 వేల కోట్ల ప్రతిపాదనలు

గతంలోనే డీపీఆర్‌లో అనేక లోపాలను ఎత్తిచూపిన కేంద్రం

కేంద్రానికి ఎల్అండ్‌టీ లేఖతో ప్రభుత్వ నిర్వాకం బట్టబయలు

ఆ తర్వాతనే హడావిడిగా సంప్రదింపులు చేసి మెట్రో టేకోవర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

నగరంలో ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు మెట్రో రైలు ఉంది. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు ప్రభుత్వం మెట్రోను విస్తరించాలనుకుంటున్నది. మరి ఎల్బీనగర్‌మియాపూర్ మెట్రోను ఎల్అండ్‌టీ నిర్వహిస్తున్నపుడు రేపు విస్తరించే ప్రాజెక్టుల నిర్వహణ ఎవరు చూస్తారు? సామాన్యుడికి సైతం వచ్చే సందేహం ఇది. కానీ ఏడాదిపాటు మెట్రో విస్తరణ ప్రాజెక్టుపై కసరత్తు చేసిన హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు లిమిటెడ్

..మిగతా 2లో

## మూసీ ముంచేసింది..



భారీ వర్షా లతో మూసీలో పెరిగిన నీటి ప్రవాహం

నీట మునిగిన మహాత్మాగాంధీ బస్‌స్టేషన్

పరీవాహక ప్రాంత కాలనీలన్నీ జలమయం

బస్టాండ్‌లోనే చిక్కుకుపోయిన ప్రయాణికులు

సురక్షిత ప్రాంతాలకు తరలించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్

ముసరాంబాగ్ వంతెన మూసివేసిన అధికారులు

03



## హైదరాబాద్ సీపీగా సజ్జనార్

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా సీవీ ఆనంద్

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణారావు

03

## స్థానిక ఎన్నికలు వాయిదా వేయండి

### బీసీ రిజర్వేషన్లపై విచారణ అక్టోబర్ 8 కి వాయిదా

మీరు ఎన్నికలు నిర్వహించినా మేం కేసు విచారిస్తాం

గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా ఇచ్చారు

సెక్షన్ 285ఏ సవరించి 3 నెలలు కాకుండానే జీవో ఎందుకు?

కోర్టుల జోక్యం ఉండకూడదంటే ఎలా?

పది రోజుల ఎన్నికలు వాయిదా వేసుకోండి

ఆగస్టు 31న గవర్నర్‌కు పంపి.. నెల తిరగక ముందే జీవో ఇస్తారా?

మూడు నెలల పరిమితిని సుప్రీం విధించింది కదా

బీసీ రిజర్వేషన్లపై చట్ట ప్రకారం ముందుకెళ్లండి




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 పై ఇవాళ హైకోర్టులో వాడివేడి వాదనలు జరిగాయి. ప్రభుత్వం రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమవుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం జీవో ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందని బెంచ్ ప్రశ్నించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం మూడు నెలల కాల పరిమితి ఉందని, ఆగస్టు 31న గవర్నర్ పరిశీలనకు బిల్లు పంపి నెల రోజులు కూడా కాకముందే ఎలా జీవో జారీ చేస్తారని అడ్వొకేట్ జనరల్ ను ప్రశ్నించింది. కేసు వాయిదా వేస్తే నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని పిటిషన్ తరఫు న్యాయవాది తెలిపారు. దీనిపై ఏజీ సుదర్శన్ రెడ్డిని బెంచ్ ప్రశ్నించింది. ఈ అంశంపై రాష్ట్ర శాసన సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, చట్ట సభను

..మిగతా 3లో



## మీది కమీషన్ల దందానే..

రూ.15వేల కోట్ల స్కాంకు తెరలేపారు

మేం అధికారంలోకి వచ్చాక ఎవ్వరినీ వదిలిపెట్టం

సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు వార్నింగ్

02

## ఆపరేషన్ సిందూర్ టైమ్‌లో అందాల పోటీలు నిర్వహించాం

హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించాం

శాంతిభద్రతల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నాం

హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో భాగ్యనగరం పోటీ పడుతున్నది

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

శిల్పారామంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించి, ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని

..మిగతా 2లో

## రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ శంకుస్థాపన

41.50 కిలోమీటర్ల పొడవు, రెండు దశల్లో పూర్తి

పర్యావరణ హిత సదుపాయాలతో ఆధునిక రహదారి రూపకల్పన

పరిశ్రమలు, ఐటీ హబ్‌లు, ఫ్యూచర్ సిటీకి కీలక కనెక్టివిటీ

02




## రేవంత్ రెడ్డి పారిపోతాడేమో..

బీఆర్ఎస్‌లో చేరిన కొడంగల్ కాంగ్రెస్, బీజేపీ నాయకులు

సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై రగిలిపోతున్నారు

కొడంగల్‌కు రేవంత్ రెడ్డి చక్రవర్తి ఏమీ కాదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ చేయరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జోస్యం చెప్పారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత నియోజకవర్గ ప్రజలు

..మిగతా 2లో

## బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్

ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి పూర్తి దేశీయంగా రూపకల్పన

26,700 మారుమూల గ్రామాలకు అందనున్న హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు

సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన ఐదో దేశంగా నిలిచిన భారత్

త్వరలోనే ఈ నెట్‌వర్క్‌ను 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడి



02



## రాజకీయాలకు సీపీఐ నారాయణ వీడ్కోలు

జాతీయ కార్యదర్శి నుంచి తప్పకున్న నేత

పంజాబ్- చండీగఢ్ సీపీఐ మహాసభలో నిర్ణయాలు

75 ఏండ్లు నిండిన వారిని తప్పించిన పార్టీ

02

## బలహీన వర్గాల నోటి కాడి ముద్ద లాగొద్దు

42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తాం

కుల సర్వే ఆధారంగా తీసుకున్న కీలక నిర్ణయం

రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బందులు లేవు

బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

03



# రాజకీయాలకు సీపీఐ నారాయణ వీడ్కోలు

- జాతీయ కార్యదర్శి నుంచి తప్పుకున్న నేత
- పంజాబ్- చండీగఢ్ సీపీఐ మహాసభలో నిర్ణయాలు
- 75 ఏండ్లు నిండిన వారిని తప్పించిన పార్టీ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



సీపీఐ నారాయణ పార్టీలోని కీలక పదవుల నుంచి తప్పుకున్నారు. గత కొన్ని ఏళ్లుగా సీపీఐ జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న నారాయణ తన పదవి నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. పంజాబ్ చండీగఢ్ లో జరిగిన 25వ సీపీఐ మహాసభల్లో కీలక నిర్ణయాలు జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను మినహాయించి, 75 ఏళ్లు నిండిన వాళ్లందరినీ తప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్త వాళ్లకు అవకాశాలు ఇవ్వడం, యువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశాలపై గతంలో విజయవాడలో జరిగిన పార్టీ మహా సభల్లోనే ప్రధానంగా చర్చ జరిగింది. అమలులో కొంత ఆలస్యమైనా మొత్తానికి పంజాబ్ లో జరిగిన మహా సభల్లో కచ్చితంగా అమలు చేయాలని కామ్రేడ్లు అనుకున్నారు. దానికి అనుగుణంగానే 75 ఏళ్లు నిండిన వాళ్లందరినీ కీలక పదవుల నుంచి తప్పించారు. సీపీఐ పార్టీలో కంట్రోల్ కమిషన్ ఏంటి? సాధారణంగా జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్రాల కార్యవర్గ సభ్యులు ముఖ్య నాయకులు అందరూ పార్టీకి సంబంధించినటువంటి భవిష్యత్తు కార్యాచరణపై, రాజకీయ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటారు. అయితే, బయటి రాజకీయాలు కాకుండా పార్టీలో అంతర్గతంగా తలెత్తే సమస్యలను, వాటిని పరిష్కరించే పని కంట్రోల్ కమిషన్ చూస్తుంది. కంట్రోల్ కమిషన్ కు చైర్మన్, సెక్రెటరీ ఉంటారు. మొత్తం 9 మంది సభ్యులు ఈ కమిషన్ లో ఉంటారు. కామ్రేడ్ నారాయణ ప్రజా పోరాటాలతోనే కాదు, తన మాటల తూటాలతోను ప్రజల్లో, పత్రికల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. సీపీఐ నారాయణ, చికెన్ నారాయణ, అంతేకాదు ఇతర పార్టీలు నారాయణకు ఎన్నో బిరుదులు ఇచ్చాయి. ఎన్నో విమర్శలు కూడా చేశారు. కొన్నిసార్లు అయితే నోరు పారేసుకునే నారాయణ అని కూడా అతడ్ని కామెంట్ చేశారు. అయితే, సీపీఐ నారాయణ మాత్రం ఎప్పుడు తన శైలి మార్చుకోలేదు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వాలపై తన మాటల తూటాలతో పేలుస్తూనే ఉండేవాడు. జాతీయ స్థాయిలో గత కొంతకాలంగా పని చేస్తున్న నారాయణ దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్న ఎక్కడ ఉన్నా సరే, ప్రతిరోజు కీలక అంశాలపై స్పందిస్తూనే ఉంటారు. అంతెందుకు ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, గవర్నర్లు, రాష్ట్రపతులు ఇలా ఎవరిని సీపీఐ నారాయణ వదల్లేదు.

# మీది కమీషన్ల దందానే..

- రూ.15వేల కోట్ల స్కాంకు తెరలేపారు
- మేం అధికారంలోకి వచ్చాక ఎవ్వరినీ వదిలిపెట్టం
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు వార్నింగ్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని టూరిజం అభివృద్ధి పేరిట కమీషన్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో కుట్రకు తెరతీసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఏకంగా 15వేల కోట్ల పనులు అప్పనంగా అప్పగిస్తూ మరో స్కాంకు రేవంత్ సర్కార్ తెరలేపిందని అన్నారు. లక్షల కోట్లు విలువ చేసే, వేలాది ఎకరాల భూములను తన అనుయాయులకు దారాదత్తం చేసేందుకు రేవంతు మార్కు భారీ స్కెచ్ వేశారని మండిపడ్డారు. ఓపెన్ బిడ్లు పిలవలేదు, అధికంగా బిడ్ దాఖలు చేసిన వారికి పనులు అప్పగించాల్సి ఉన్నా ఎక్కడా నిబంధనలు పాటించలేదని హరీశ్‌రావు అన్నారు. టెండర్లు పిలిచింది లేదు, నిబంధనలు పాటించింది లేదు.. కమీషన్లు దండుకునేందుకు వట్టి డంబాచారం, డబ్బా ప్రచారమని విమర్శించారు. ఇద్దరు, ముగ్గురిని మాత్రమే కన్సల్టెంట్స్ గా పెట్టుకొని పనులను సీక్రెట్‌గా ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఇందులో ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? ప్రభుత్వ భూములను, ప్రజా ధనాన్ని ఎవరికి దోచి పెడుతున్నారని నిలదీశారు. లగ్జరీ వెల్ నెస్ రిసార్ట్స్, వైన్ యార్డు రిసార్ట్స్, లగ్జరీ హోటల్స్, వాటర్ ఫ్రంట్ రిసార్ట్స్, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, థీమ్ పార్కుల అభివృద్ధి పేరిట మీరు చేస్తున్నది ముమ్మాటికీ స్కామే.. కమీషన్ల దందానే అని అన్నారు. ఈ స్కాం సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా త్వరలో బయటపెడుతామని తెలిపారు. అధికారం శాశ్వతం కాదు, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. ఈ దోపిడీలో భాగమైన ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదని అన్నారు. ఈ మొత్తం స్కాంపై విచారణ జరిపిస్తం, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.. పబ్లిక్ మనీని రికవరీ పెడుతామని హెచ్చరించారు.




# రేవంత్ రెడ్డి పారిపోతాడేమో..

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డిపై ఆగ్రహంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశమని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ గెలవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు బంధు పథకాన్ని రేవంత్ రెడ్డి బంద్ చేస్తారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి గురించి అందరి కంటే ఎక్కువగా కొడంగల్ ప్రజలకే తెలుసని కేటీఆర్ అన్నారు. కొడంగల్‌కు రేవంత్ రెడ్డి చక్రవర్తి ఏమీ కాదని, ఆయనపై ప్రజలకు ఆగ్రహం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే కొడంగల్ నియోజకవర్గానికి తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారని విమర్శించారు. ఆయనకు కలెక్టర్, ఎస్పీ వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి, తిరుపతి రెడ్డిలు రిబ్బన్ కట్ చేస్తున్నారని, అందుకే జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.

# సర్కారు తప్పిదంతోనే మెట్రో భారం!

**మొదటిపేజీ తరువాయి**



(హెచ్ఎంఆర్ఎల్), ప్రభుత్వానికి మాత్రం ఈ సందేహం రాలేదా? వచ్చినా ఉద్దేశపూర్వకంగా డీపీఆర్‌లో ఈ అంశాన్ని పొందుపరచలేదా? వాస్తవమేదైనా.. సర్కారు తప్పిదం తెలంగాణ ప్రజలపై రూ.15వేల కోట్ల మెట్రో భారం మోపింది. 'ప్రభుత్వంలో ఉన్నవాళ్లం! ఎల్అండ్‌టీని మనం అడిగేదేముంది!' అన్న తరహాలో కాంగ్రెస్ సర్కారు దుందుడుకు చర్య 20 ఏండ్ల పాటు అనవసరపు మెట్రో నిర్వహణ బాధ్యత ప్రభుత్వ భుజాలపై వేసింది.

**ఎల్అండ్‌టీని పరిగణించని ప్రభుత్వం**

హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ (ఏ) కింద వివిధ మార్గాల్లో 76.4 కిలోమీటర్ల విస్తరణ ప్రాజెక్టుల్ని రూ.24,269 కోట్లతో చేపట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డీపీఆర్ తయారు చేసింది. దీంతోపాటు రెండో దశ (బీ) కింద పలు మార్గాల్లో మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ ప్రాజెక్టును రూ.19,579 కోట్లతో చేపడతామని డీపీఆర్‌లో పొందుపరిచింది. అంటే ఇప్పుడున్న 69 కిలోమీటర్ల మొదటి దశకు అదనంగా మరో 162.5 కిలోమీటర్ల విస్తరణను రూ.43,848 కోట్లతో చేపట్టాలని అనుకుంది. అలాంటప్పుడు డీపీఆర్ తయారు చేసే సమయంలోనే మొదటి దశ మెట్రో నడుపుతున్న ఎల్అండ్‌టీని పరిగణలోనికి తీసుకొని, వారితో మాట్లాడాలి. ఏ ప్రభుత్వమైనా భవిష్యత్తులో సాంకేతికంగా ఇబ్బందులు రాకుండా ఉండేందుకు చేపట్టే ముందుచూపు చర్య ఇది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ఎల్అండ్‌టీని తమ దరిదాపుల్లోకి కూడా రానీయలేదని స్పష్టమవుతున్నది. ఎందుకంటే.. గతంలో హైదరాబాద్ మెట్రో ఎండీ, ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఎన్వీఎస్ రెడ్డి ఒక సందర్భంలో మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. మొదటి దశతో విస్తరణ ప్రాజెక్టుల అనుసంధానంలో ఎల్అండ్‌టీతో ఎలాంటి సమస్య లేదు అని స్పష్టం చేశారు. కానీ ఎల్అండ్‌టీ కేంద్రానికి లేఖ రాస్తూ మెట్రో విస్తరణ ప్రాజెక్టుల్లో మేం భాగస్వాములం కాలేం, పైగా మొదటి దశను కూడా ప్రభుత్వాలే తీసుకోండి అని బాంబు పేల్చే వరకు అసలు విషయం బయటికి రాలేదు. మరి.. మెట్రో ఎండీగా 15 ఏండ్ల పాటు ఎల్అండ్‌టీతో టచ్‌లో ఉన్న ఎన్వీఎస్ రెడ్డి సమస్య లేదని చెప్పిన చాలాకాలం తర్వాత ఆ కంపెనీ మాత్రం సమస్య ఉందని కేంద్రానికి లేఖ రాయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అంటే ఆదిలో ఎల్అండ్‌టీ సుముఖంగానే ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పిలిచి మాట్లాడకపోవడం, ఏకపక్షంగా మెట్రో విస్తరణ ప్రాజెక్టులపై ముందుకుపోతుండటంతో ఆ కంపెనీ గుడ్‌బై చెప్పాలనే సంచలనం నిర్ణయం తీసుకుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**2100 కోట్లతో ఒడిసేదానికి 15వేల కోట్ల భారం!**

వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అప్పుల భారం ఉందన్న ఎల్అండ్‌టీకి ఆర్థికంగా ఊరట కల్పించేందుకు రూ.3వేల కోట్ల వడ్డీలేని రుణం ఇవ్వాలని ఒప్పందం జరిగింది. అందులో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం రూ.900 కోట్లు ఇచ్చింది. అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మిగిలిన రూ.2100 కోట్లు సర్దుబాటు చేస్తే సరిపోయేది. ప్రభుత్వం అప్పు ఇచ్చినందుకు ఎల్అండ్‌టీ మెట్రో విస్తరణ ప్రాజెక్టుల్లోనూ పాల్గొనేది. పైగా ప్రభుత్వానికి ఎల్అండ్‌టీ తిరిగి రూ.3వేల కోట్లు చెల్లించేది. వీటన్నింటికీ మించి.. 2010 సంవత్సరంలో వైఎస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా 35 ఏండ్ల పాటు ఎల్అండ్‌టీ నిర్వహణ బాధ్యతను చూడాల్సి ఉంది. ఆ మేరకు 2045 వరకు మెట్రో మొదటిదశ నిర్వహణ బాధ్యతను ఆ కంపెనీనే చూసుకునేది. ఆ తర్వాత ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుతోపాటు ఆ కంపెనీకి అప్పగించిన 260 ఎకరాలకుపైగా అత్యంత విలువైన భూములు తిరిగి ప్రభుత్వానికే దక్కేవి. కానీ ఇప్పుడు రూ.2వేల కోట్లను ప్రభుత్వం ఎల్అండ్‌టీకి ఇచ్చేందుకు అంగీకరించింది. గతంలోని రూ.900 కోట్లు కలుపుకుంటే రూ.2900 కోట్ల నగదును ప్రభుత్వం ఆ కంపెనీకి చెల్లించినట్లయింది. ఇందుకు ప్రతిగా రూ.13వేల కోట్ల కంపెనీ అప్పులను ప్రభుత్వం భుజానికి ఎత్తుకుంది. ఇది ప్రభుత్వం తీరుతో రాష్ట్రంపై పడుతున్న మోయలేని భారం.

# రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ శంకుస్థాపన

- 41.50 కిలోమీటర్ల పొడవు, రెండు దశల్లో పూర్తి
- పర్యావరణ హిత సదుపాయాలతో ఆధునిక రహదారి రూపకల్పన
- పరిశ్రమలు, ఐటీ హబ్‌లు, ఫ్యూచర్ సిటీకి కీలక కనెక్టివిటీ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



హైదరాబాద్‌లో కనెక్టివిటీని బలోపేతం చేయడం, పరిశ్రమలు, ఐటీ హబ్‌లు , ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి దోహదం చేయడం లక్ష్యంగా రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ నిర్మాణానికి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ రహదారి రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి అమనగల్ ఆర్ఆర్ఆర్ వరకు విస్తరించి మొత్తం పొడవు 41.50 కిలోమీటర్లు ఉంటుందని అధికారులు తెలిపారు. రహదారి నిర్మాణం రెండు దశల్లో జరుగుతుంది. ఫేజ్-1 లో రావిర్యాల్ నుంచి మీర్కాన్‌పేట్ వరకు 19.20 కిలోమీటర్లు, ఫేజ్-2 లో మీర్కాన్‌పేట్ నుంచి అమంగల్ వరకు 22.30 కిలోమీటర్లు నిర్మాణం చేయనున్నారు. రహదారి వెడల్పు 100 మీటర్లు, 4+4 లేన్లతో రూపకల్పన చేయబడింది. దీనిలో మెట్రో రైల్వే కారిడార్, సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు, సర్వీస్ రోడ్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. మొత్తం 14 గ్రామాల మీదుగా రహదారి విస్తరించనుంది. ఫేజ్-1 నిర్మాణానికి ₹1,911 కోట్లు, ఫేజ్-2 కు ₹2,710 కోట్లు ఖర్చు అవుతుంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం ₹4,621 కోట్లు ఉండనుంది. ప్రాజెక్టు 8.94 కిలోమీటర్ల మేర రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో కూడా మార్గం కట్టబోతున్నది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ పూర్తి అయిన తర్వాత పరిశ్రమలు, ఐటీ హబ్‌లు, ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ పెరుగుతుంది. పర్యావరణ హిత రవాణా కోసం సైకిల్ ట్రాక్‌లు, గ్రీన్ బెల్ట్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. అదనంగా, ఈ రహదారి ఈసిటీకి కీలక కనెక్టివిటీని అందిస్తుంది, ముఖ్యంగా సెమీ కండక్టర్ , హార్డ్‌వేర్ ఉత్పత్తి రంగాలకు పెద్ద ఊతమివ్వనుందని అధికారులు పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ టైమ్‌లో అందాల పోటీలు నిర్వహించాం

**మొదటిపేజీ తరువాయి**

కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కొత్త టూరిజం పాలసీని తీసుకువచ్చినట్లు తెలిపారు. గోల్కొండ, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోందని ఆయన అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్

- ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి పూర్తి దేశీయంగా రూపకల్పన
- 26,700 మారుమూల గ్రామాలకు అందనున్న హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు
- సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన ఐదో దేశంగా నిలిచిన భారత్
- త్వరలోనే ఈ నెట్‌వర్క్‌ను 5జీకి అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడి

**ఒడిశా, ప్రజాస్వరం :**



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.

**భారత టెక్ దిగ్గజాల భాగస్వామ్యం**

ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీడాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీడాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామీణ భారత్‌కు డిజిటల్ వరం**

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ చైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# స్థానిక ఎన్నికలు వాయిదా వేయండి

మొదటిపేజీ తరువాయి

గౌరవించాలని కోరారు. దీనిపై స్పందించిన కోర్టు గవర్నర్ కు పంపిన బిల్లుకు ఇంకా గడువు ఉందని నవంబర్ లో ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. సింగిల్ బెంచ్ సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిందని ఏజీ ధర్మాసనానికి తెలిపారు. కేసు విచారణను ఈ నెల అక్టోబర్ 8వ తేదీకి వాయిదా వేస్తున్నామని, అప్పటి వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వవదని సూచించింది. పది రోజుల పాటు ఎన్నికలు వాయిదా వేసుకోవాలని సూచించింది.

**నవంబర్ వరకు ఆగండి...**

42% పెంచుకోవాలనుకుంటే నవంబర్ వరకు ఆగాలని బెంచ్ సూచించింది. గవర్నర్ ఏమీ చెప్పకుంటే ఆ బిల్లు పాస్ అయినట్టే కదా? అప్పటి వరకు ఆగాల్సిందేనని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే రిట్ పిటిషన్లు అడ్మిషన్ కాదు.. అప్పుడెలా..? అని బెంచ్ ప్రశ్నించింది. విచారణ సందర్భంగా పది రోజుల వరకు ఎన్నికలు ఆపగలరా..? అని ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. తాము ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా మెరిట్స్ ప్రకారం విచారణ నిర్వహిస్తామని బెంచ్ తెలిపింది.

# బలహీన వర్గాల నోటి కాడి ముద్ద లాగొద్దు

- **42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తాం**
- **కుల సర్వే ఆధారంగా తీసుకున్న కీలక నిర్ణయం**
- **బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బలహీన వర్గాల రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం వెనకడుగు వేయదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కుల గణన సర్వే నిర్వహించామని, ఆ సర్వే ఆధారంగా సబ్ కమిటీ ఏర్పాటు చేసి రిజర్వేషన్లు పెంచే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ నిర్ణయానికి చట్టసభలలో అన్ని పార్టీల మద్దతు లభించిందని, మూడ్ ఆఫ్ హౌజ్ తీసుకున్న తర్వాతే బిల్లు ఆమోదించబడి గవర్నర్‌కు పంపించామని చెప్పారు. అనంతరం గవర్నర్ రాష్ట్రపతికి ఆమోదం కోసం పంపారని తెలిపారు. తమిళనాడు ఉదాహరణను ప్రస్తావిస్తూ, గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కూడా రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని కోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని పొన్నం గుర్తు చేశారు. దాని ప్రకారం తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 9 ద్వారా 42 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసిందని అన్నారు. "10 శాతం EWS రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఎవ్వరూ వ్యతిరేకించలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా వచ్చిన రిజర్వేషన్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు" అని మంత్రి హామీ ఇచ్చారు. "రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు బలహీన వర్గాల భవిష్యత్తు కోసం. మా నోటి కాడి ముద్ద లాగవద్దు. తెలంగాణ సమాజం మొత్తం కలిసి ఈ రిజర్వేషన్లను కాపాడుకోవాలి. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ ఛాంపియన్" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతంలో బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేశారు. "పది ఏళ్లలో ఎంత మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారు, ఎంతమందికి మూడు ఎకరాల భూమి ఇచ్చారు? కవిత స్వయంగా చెప్పినట్టుగా వాళ్ల ఇళ్ళలో బంగారం ఉంటే తెలంగాణ అంతా బంగారం కాలేదు" అంటూ ఎద్దేవా చేశారు.

# హైదరాబాద్ సీపీగా సజ్జనార్

- **తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు**
- **హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా సీవీ ఆనంద్**
- **ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ రామకృష్ణారావు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ కమిషనర్ గా ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా ఉన్న వీ.సీ.సజ్జనార్ నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న సీ.వీ.ఆనంద్ ను హోంశాఖకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. హోంశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న రవిగుప్తాకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఎగ్జిక్యూటీవ్ వైస్ ఛైర్మన్, డైరెక్టర్ జనరల్ గా పోస్టింగ్ ఇచ్చారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ గా ఉన్న శిఖా గోయల్ ను బదిలీ చేస్తూ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ డీజీగా నియమించారు. దాంతోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. పోలీస్ ఆర్గనైజేషన్స్, హోంగార్డ్స్ అదనపు డీజీగా ఉన్న స్వాతి లక్రాకు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్ ను అదనపు డీజీపీ (పర్సనల్)గా నియమించారు. అక్కడ ఉన్నడాక్టర్ అనిల్ కుమార్ కు గ్రేహౌండ్స్, ఆక్టోపస్, అదనపు డీజీపీ (ఆపరేషన్స్)గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక, ఏసీబీ డైరెక్టర్ గా ఉన్న అదనపు డీజీపీ విజయ్ కుమార్ ను ఇంటెలిజెన్స్ ఛీఫ్ గా నియమించారు. సీఐడీ అదనపు డీజీపీగా ఉన్న చారూ సిన్హాను ఏసీబీ డీజీగా నియమించారు. అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న వై.నాగిరెడ్డికి ఆర్టీసీ ఎండీగా పోస్టింగ్ ఇచ్చారు. పౌరసరఫరాలో ఉన్న దేవేంద్ర సింగ్ చౌహాన్ ను మల్టీజోన్ 2 అదనపు డీజీపీగా నియమించారు. హైదరాబాద్ అదనపు కమిషనర్ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న విక్రమ్ సింగ్ మాన్ ను బదిలీ చేసి అగ్నిమాపక శాక డీజీగా నియమించారు. గ్రే హౌండ్స్ లో ఉన్న స్టీఫెన్ రవీంద్రకు సివిల్ సప్లయిస్ లో పోస్టింగ్ ఇచ్చారు. సీఐడీ అదనపు ఐజీగా ఉన్న ఎం.శ్రీనివాసులను హైదరాబాద్ అదనపు సీపీ (లా అండ్ ఆర్డర్)గా నియమించారు. మల్టీజోన్ 2 డీఐజీ తఫ్సీర్ ఇక్బాల్ ను ట్రాన్స్ ఫర్ చేసి హైదరాబాద్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) నియమించారు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ కు సిద్దిపేట పోలీస్ కమిషనర్ గా పోస్టింగ్ ఇచ్చారు. ఇంటెలిజెన్స్ లో ఎస్పీగా ఉన్నసింధూ శర్మను ఏసీబీ జాయింట్ డైరెక్టర్ గా బదిలీ చేశారు. మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ ను నారాయణపేట ఎస్పీగా నియమించారు. సిద్దిపేట కమిషనర్ గా ఉన్న అనురాధను రాచకొండ కమిషనరేట్ లోని ఎల్బీనగర్ జోన్ డీసీపీగా నియమించారు. సీ.హెచ్.ప్రవీణ్ కుమార్ ను ఏసీబీ జాయింట్ డైరెక్టర్ గా నియమించారు. నారాయణపేట ఎస్పీగా ఉన్న యోగేశ్ గౌతమ్ ను బదిలీ చేసి సైబరాబాద్ కమిషనరేట్ లోని రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ ఉన్న సీ.హెచ్.శ్రీనివాస్ ను హైదరాబాద్ కమిషనరేట్ లోని వెస్ట్ జోన్ డీసీపీగా నియమించారు. మాదాపూర్ జోన్ డీసీపీగా రితిరాజ్ ను నియమించారు.



# మూసీ ముంచేసింది..

- **భారీ వర్షాలతో మూసీలో పెరిగిన నీటి ప్రవాహం**
- **నీట మునిగిన మహాత్మాగాంధీ బస్‌స్టేషన్**
- **పరీవాహక ప్రాంత కాలనీలన్నీ జలమయం**
- **బస్టాండ్‌లోనే చిక్కుకుపోయిన ప్రయాణికులు**
- **ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్**
- **ముసరాంబాగ్ వంతెన మూసివేసిన అధికారులు**





**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మూసీ నదికి వరద ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ గేట్లు తెరవడంతో నదిలోకి నీటి ప్రవాహం మరింత పెరిగింది. భారీ వర్షాల కారణంగా మూసీ నదిలో నీటి ప్రవాహం పెరిగిపోవడంతో, ముసరాంబాగ్ వంతెన మూసివేశారు. దీంతో రాకపోకలు నిలిపివేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో మూసీ నదికి వరద ఉద్ధృతి రావడంతో కొత్తగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వరదల వల్ల పాతబస్తీ, అంబర్‌పేట, చాదర్‌ఘాట్ నుంచి ఎంజీబీఎస్ వరకు నీరు చేరింది. మరోవైపు.. ఎంజీబీఎస్‌కి వరద పోటెత్తింది. తెలంగాణలో దసరా, బతుకమ్మ పండుగలకు ఎంత ప్రాధాన్యత ఉందో చెప్పనవసరం లేదు. నగరానికి బతుకుదెరువు నిమిత్తం పట్టణానికి వలస వచ్చిన వారందరూ పల్లెలకు బయలుదేరేందుకు ఎంజీబీఎస్‌కి చేరుకున్నారు. నగరంలో చదువుతున్న విద్యార్థులు సైతం సెలవుల నేపథ్యంలో ఇళ్లకు బయలుదేరారు. ఇలా ఎంజీబీఎస్‌కి చేరిన ప్రయాణికుల తమ బస్సుల కోసం ఎదురుచూస్తున్న క్రమంలోనే మూసీ ఉద్ధృతి ఒక్కసారిగా పెరిగిపోయింది. నది ఒడ్డున ఉన్న ఎంజీబీఎస్ బస్టాండ్‌లోకి వరద నీరు పోటెత్తింది. బస్టాండ్‌లో ఎక్కడికక్కడ నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందల మంది ప్రయాణికులు బస్టాండ్‌లోనే చిక్కుకుపోయారు. గంటల పాటు భయం గుప్పిట్లో అల్లాడిపోయారు. "పండగ పూట ఇంటికి ఎట్లా పోయేది సారూ" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు రంగంలోకి దిగారు. తాజాగా మూసీ వరద ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు.. చాదర్ ఘాట్, మూసారంబాగ్, ఎంజీ బీ ఎస్ ప్రాంతాల్లో పర్యటించారు. చాదర్ ఘాట్ ప్రాంతంలో మూసి నది ముంచెత్తిన నివాస ప్రాంతాలలో సహాయక చర్యలను పరిశీలించారు. నీట మునిగిన ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అక్కడ వరదలో చిక్కుకుని భవనాల పై ఉన్నవాళ్ళకి డ్రోన్స్ ద్వారా ఆహారం అందజేశారు. ఎంజీబీఎస్ వద్ద మూసి నది రిటైనింగ్ వాల్ పడిపోవడంతో వరద లోపలకి ప్రవేశించిన ప్రాంతాలను పరిశీలించారు. దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బందిని చేయాలని ఆదేశించారు.. శుక్రవారం అర్ధ రాత్రి ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి వరద వచ్చినప్పుడు చేపట్టిన సహాయక చర్యలను కమిషనర్ అభినందించారు.











# బీసీ రిజర్వేషన్లపై ఇచ్చిన హామీ నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ

- **బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్**



మంథని/ద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజాస్వరం): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుటకు జీవో జారీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి బీసీ సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పంతకాని శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీల ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయుటకు కుల గణన జరిపి మరియు బీసీ డెడికేటెడ్ కమిటీని నియమించి బీసీలకు అన్ని రంగాల్లో జరుగుతున్న మోసాలను అధ్యయనం చేసి బీసీ డెలికేటెడ్ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా కమిటీ యొక్క సిఫార్సు మేరకు బీసీ రిజర్వేషన్ల పరిమితిని 42 శాతానికి పెంచడం శుభపరి నామం పెంచిన 42శాతం రిజర్వేషన్ల ప్రకారం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సంఖ్యలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం దక్కుతుంది ఈ రిజర్వేషన్లను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా న్యాయపరమైన సాంకేతికమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎన్నికల్లో ఇచ్చిన బీసీ రిజర్వేషన్ పెంపు హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు బీసీ సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ మద్యం నిషేధిత గుట్కా అమ్మకాలపైన చర్యలు తీసుకోవాలి

మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం): అక్రమ మద్యం,నిషేధిత గుట్కా అమ్మకాల పైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మంథని మండలం ఉప్పట్ల గ్రామానికి చెందిన బడికల సతీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గ్రామంలో బెల్ట్ షాపులతో అక్రమ మద్యం అమ్ముతున్నటువంటి వ్యక్తి పైన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఏకంగా గవర్నమెంట్ వాటర్ ట్యాంక్ నే పర్మిట్ రూమ్ గా వాడుకుంటూ అక్రమ మద్యం,నిషేధిత గుట్కా విచ్చలవిడిగా అమ్ముతున్నటువంటి వ్యక్తి పైన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.బెల్ట్ షాప్ ల వల్ల గ్రామంలో మహిళలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,బెల్ట్ షాపు నిర్వాహకుల పైన ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని భవిష్యత్తులో బెల్ట్ షాప్ నిర్వహించకుండా చూడాలని ఆయన కోరారు.

# లలితా త్రిపురసుందరి దేవిగా దుర్గమ్మ



మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం)దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6 వ రోజు మెదక్ పట్టణంలోని సాయినగర్ కాలనీ లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మాత శ్రీ లలితా త్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి వేదపండితులు వైద్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు పూజానంతరం అమ్మవారికి కుంకుమార్చన, లలితా సహస్ర నామం, మణిద్వీపావర్ణన పూజలు జరిగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకన్న, తిరుపతి రెడ్డి, రమేష్, సందీప్, నవీన్, మధు, మణికంఠ, మాణికాంత్, లోకేష్,శివకుమార్, శ్రీచరణ్, వర్ధన్,భాగ్య, లావణ్య, సుజాత, కాలనీలోని మహిళలు పాల్గొన్నారు.





# వృద్ధాశ్రమంలో వృద్ధులకు వి.ఎస్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ





- **వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్.**

గోదావరిఖని/పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గౌతమ్ నగర్ సమీపంలోని వీర్లపల్లిలో ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో బతకమ్మ,దసరా పండుగ సందర్భంగా వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.అనంతరం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆర్సి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ సలహాదారులు కజాంపురం రాజేందర్,లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం అధ్యక్షుడు,వడ్లకొండ ఎల్లప్ప, సంస్థ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వేముల రమేష్,భూపాలపల్లి జయశంకర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పుల పవన్ కుమార్ హాజరై మాట్లాడారు.వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం లాగా ఈశ్వర కృప వృద్ధాశ్రమంలోని వృద్ధులందరికీ నూతన వస్త్రాలు పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. ఉప్పుల పవన్ కుమార్ సహాయ సహకారంతో నిరస్యరాశ్యులైన వృద్ధులకి పండగ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఆశ్రమంలోని వృద్ధులు అందరిలాగే పండగలు జరుపుకోవాలనే ఉద్దేశంతో వారికి వస్త్రాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.తమ సంస్థ ఆధ్వర్యంలో ముందు ముందు ఆశ్రమంలోని వృద్ధులకు ఎలాంటి అవసరాలు అయినా తోడుంటానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఆశ్రమ డైరెక్టర్లు ఎల్ మాధవ రెడ్డి,ఆకిరెడ్డి రామచంద్రా రావు,ఆశ్రమ గౌరవ సలహాదారుడు సీతారాం రెడ్డితో పాటు ఆశ్రమ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం అపూర్వ స్పందన

శామీర్ పేట సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) ఆలియాబాద్ మున్సిపల్ అలియాబాద్ ఎస్సీ కాలనీలో శనివారం ఐజిఎఫ్ స్వచ్ఛంద సంస్థదాట్ల ఫౌండేషన్ బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. వైద్య శిబిరంలో పిల్లల నుంచి పెద్దలవరకి డాక్టర్ ఒర్రె భవాని చేత ఉచిత వైద్య పరీక్షలు మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. బిపి, షుగర్, హెచ్ బి నీ నిర్ధారించి మందులను పంపిణీ చేయడం జరిగింది. ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవటానికి డాక్టర్ ఒర్రె భవాని అవగాహన కల్పించారు. అలియాబాద్ యువజన కార్యకర్తలు మామిడి శెట్టి మహేష్, బాయికాడి వినోద్ సమన్వయంతో ఈ ఉచిత వైద్య శిబిరంలో 100 మంది ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఇలాసాగర్ శ్రీకాంత్, మచ్చ మధు, ఎలబోయిన సాంబరాజు, డాక్టర్ ఒర్రె భవాని, గ్రామ ప్రజలు గాదె బాలమణి, మేడిలక్ష్మి, పి వేణుకుమార్, క్యాశరం జ్యోతి, తిరుగుల ఎల్లమ్మ, ధూదెద బాలయ్య, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఆర్ వియం హాస్పిటల్ సౌజన్యంతో బతుకమ్మ సంబరాలు





- **మొదటి బహుమతి:మజీద్ పూర్ 5000/-**
- **రెండవ బహుమతి: మురహరి పల్లి 3000/**
- **మూడవ బహుమతి అలియాబాద్: 2000/-**

శామీర్ పేట సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) ఆర్.వి యం హాస్పిటల్ వారి సహకారంతో నూతనంగా ఏర్పడ్డ అలియబద్, మజీద్ పూర్ , లాల్ గడి మలక్ పెట్ , తుర్కపల్లి, మురహరి పల్లి , యడారం గ్రామాల కలయికతో అలియబద్ మునిసిపాలిటీ ఆవరణలో శనివారం అంగరంగ వైభవంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగ సందర్భంగా 6 గ్రామాల సోదరీమణులచే అలియబద్ మునిసిపల్ కమిషనర్
చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అలియబద్ అనుసంధానం అయిన 6 గ్రామాల వారు చక్కనైన బతుకమ్మ పేర్చిన వారికి నగతు బహుమతి ప్రొత్సహం పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం 6 గ్రామాల,మహిళ సంఘాలు , ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, యువతులు , మహిళలు, పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు బతుకమ్మ ఆటపాటలతో నిర్వహిచడం జరిగింది. మొదటి బహుమతి మజీద్ పూర్ 5000/, రెండవ బహుమతి :మురహరి పల్లి 3000/ మూడవ బహుమతి ఆలియాబాద్:2000/
నాల్గోవ బహుమతి యడారం :1000/ అందిచడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, ఆర్.వి.యం మేనేజర్, సామాజిక వేత్త మంచినీళ్ళ లక్ష్మణ్, గ్రామ పెద్దలు బండి రాంరెడ్డి, గ్రామా పెద్దలు కాంగ్రెస్ గ్రామ ప్రెసిడెంట్ తమాటం యాదగిరి, బన్సీలాల్, ఇంద్రిరమ్మ కమిటీ మెంబర్ ముద్దం వీరారెడ్డి ఆలియాబాద్ మునిసిపల్ సిబ్బంది అనీల్ రెడ్డి, సర్వోతంరెడ్డి, కల్పన, విఓఎన్ సోని, మాధవి తదితరులతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. ఈ నగతు బహుమతి ప్రోత్సాహంతో మాకు సంతోషంగా ఉంది అని మహిళా సోదరి మణులు అలియబద్ మున్సిపాలిటీ కమిషనర్ మునిసిపాలిటీ దాసరి హోలియ సంఘం అధ్యక్షులు తమటం శ్రవణ్ తో పాటు 6 గ్రామాల పెద్దలు యువతి యువకులు మహిళా సంఘాలు పెద్దలు ఆర్ వి యం హాస్పిటల్ ను యాజమాన్యాన్ని అభినందించారు.



# మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు



శామీర్ పేట సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా వైద్య ఆరోగ్య, కో ఆపరేటివ్, పరిశ్రమలు, సమాచార శాఖల ఆధ్వర్యంలో అంబరాన్ని అంటే విధంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, డిఎం అండ్ హెచ్ ఓ ఉమాగౌరీ, కో ఆపరేటివ్ అధికారి వెంకటరెడ్డి, సమాచార శాఖ అధికారులు నాగాంజలి, స్వర్ణలత సాంస్కృతిక కళాకారులు, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహనీయులను స్మరించుకోవడం శుభపరిణామం



మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం) కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని శనివారం మెదక్ జిల్లా కేంద్రం లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రుక్మిణి కృష్ణ మాట్లాడుతూ మంత్రి పదవిని సైతం వదులుకుని తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. అలాంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేకల జయరాములు, చేనేత అధ్యక్షుడు బొడ్డుల సంతోష్, పట్టణ అధ్యక్షుడు చెన్న రామచందర్, సెక్రటరీ దాసరి విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బుడ్డ రాజు, మాజీ కౌన్సిలర్ రుక్మిణి కృష్ణ, విశ్వనాథం, శంకర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## దేవరయంజల్ లో భగత్ సింగ్ 118 వ జయంతి



శామీర్ పేట సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ 118 వ జయంతి సందర్భంగా శనివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో శ్రీ సీతా రామస్వామి దేవస్థానం చైర్మన్, మున్సిపల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పెండం లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు,పుర ప్రముఖులు హాజరై భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతా రామ స్వామి దేవస్థానం ధర్మకర్తలు వలందాసు మురళి గౌడ్, హరిగోపాల్, హరికృష్ణ, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పట్నం నర్సింహా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, రామాలయం మాజీ చైర్మన్ పన్నాల సుధాకర్ రెడ్డి, మాజీ ధర్మకర్త పట్నం నర్సింహా రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింగ్ రావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సుదీర్ జ్ఞాపకార్థం పరిశుద్య కార్మికులకు బట్టలు పంపిణీ



శామీర్ పేట సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) ఆలియాబాద్ మున్సిపల్ ఆలియాబాద్ గ్రామానికి చెందిన అశోక్ రావు అరుణ దంపతుల కుమారుడు సుధీర్ జ్ఞాపకార్థం అలియాబాద్ మున్సిపల్ పరిశుద్య కార్మికులకు శనివారం బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ.టి.సి నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి

- **పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు.**
- **నైపుణ్య కోర్సులతో ఉపాధి గ్యారెంటీ.**
- **పెద్దపల్లిలో ఆధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.**



పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం): ఏ.టి.సి నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.శనివారం పెద్దపెల్లి ఐటిఐ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధునాతన సాంకేతిక కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ 2324 కోట్లు పైగా ఖర్చు చేసి ప్రజా ప్రభుత్వం 65 ఐటిఐ సెంటర్లను ఆధునాతన సాంకేతిక కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని అన్నారు.ఏ.టి.సి నందు నైపుణ్య శిక్షణ పొందిన పిల్లలకు కనీసం 20 వేల రూపాయల ప్రారంభ వేతనంతో ఉపాధి లభించేలా అనేక కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అన్నారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు అందించేందుకు టాటా సంస్థ సహకారంతో వివిధ కోర్సులు ఏ.టి.సి లో విద్యార్థులకు నేర్పిస్తున్నామని అన్నారు.మన జిల్లాలో ఏ.టి.సి లో 250 పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు.పెద్దపల్లి లో ఐటిఐ ఏర్పడి 65 సంవత్సరాలు దాటిందని,ఇక్కడ కోర్సులు చేసిన అభ్యర్థులు సింగరేణి లో కూడా అనేక అవకాశాలు పొందారని అన్నారు.ప్రస్తుత ఏ.టి.సి సెంటర్ ద్వారా అందించే నైపుణ్య శిక్షణ చాలా ప్రాముఖ్యమైందని అన్నారు.తల్లిదండ్రులు ఇంజనీరింగ్,ఎంబిఏ వంటి కోర్సులనే కాకుండా మంచి ఉపాధి అవకాశాలు సత్వరం లభించే ఏ.టి.సి కోర్సుల వైపు కూడా తమ పిల్లలను ప్రోత్సాహించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా పిల్లలు బాగా చదువుకొని మన జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ గౌడ్,ఐటిఐ ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకటరెడ్డి ,సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని కృషి చేసిన నాయకుడు

- **పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా.**
  **రామగుండం కమిషనరేట్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**



రామగుండం/పెద్దపల్లి, సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం): స్వాతంత్ర సమరయోధుడు,తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని,ఆస్తులను దానం చేశారని,స్వాతంత్ర పోరాటం,నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని, దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు.కొమరంభీం జిల్లా,వాంకిడి గ్రామంలో 1915 సెప్టెంబర్ 27న జన్మించారని 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మన్ తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారన్నారు.195760 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా,అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినేట్‌లో ఎక్సైజ్, చేనేత,చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక,సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.1969 తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని తెలంగాణ కోసం ఉద్యమించి,ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష,ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు.ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారని వారి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు.ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్,ఐటి కోర్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్ గౌడ్,ఆర్ఐ లు దామోదర్,శ్రీనివాస్,శేఖర్, సిసి హరీష్,సీపీఓ సిబ్బంది,వివిధ వింగ్స్ సిబ్బంది ,ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో యువత రాజకీయాలలోకి రావాలి

- **భగత్ సింగ్ ఆశయ సాధన కోసం డివైఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తుంది.**
- **భగత్ సింగ్ కి భారతరత్న ఇవ్వాలి.**
- **డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్.**



మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం):

భారత స్వాతంత్ర సమరయోధుడు షాహిద్ భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంథనిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ మాట్లాడుతూ "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదంతో తన 23 సంవత్సరాల అతి చిన్న వయసులో ఉరి కంబాన్ని ముద్దాడిన వీర యోధుడు భగత్ సింగ్ అని,చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోయాడని,దేశానికి స్వాతంత్రం రావడం కోసం అందరూ సమానంగా బ్రతికే నవ సమాజం రావాలని కలలుగన్నారని,ఆయన ఇచ్చిన నినాద స్ఫూర్తితో ఆయన కలలుగన్న నవ సమాజం కోసం నేటి యువత నడుంబిగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.దేశంలో మతం పేరుతో దాడులు హత్యలు,మత కలహాలు జరుగుతూ లౌకిక వ్యవస్థకు ప్రమాదకరంగా మారిందని మతోన్మాదంపై కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే యువజన,విద్యా వ్యతిరేక విధానాలపై డివైఎఫ్ఐ గా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని,అలా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే భగత్ సింగ్ కి మనమిచ్చే ఘనమైన నివాళి అని కొనియాడారు.ఈ దేశ అభివృద్ధి కోసం నిలబడే వ్యక్తి గుడ్డి విశ్వాసాలను,మూఢనమ్మకాలను,మత తత్వ భావాలను విమర్శించాలని చెప్పారు. భగత్ సింగ్ కి భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భగత్ సింగ్ కు భారతరత్న ఇవ్వడమే వారికి ఘనమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బూడిద గణేష్,అర్ల సందీప్,ముజీబ్,శంకర్,రాజేశం,రవి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటం చేసిన యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ.**
- **ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మంత్రి పదవి రాజీనామా చేసిన త్యాగశీలి.**
- **అట్టహాసంగా జరిగిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు.**




పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కొండా లక్ష్మణ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం పరిపాలన నుండి స్వాతంత్రం,దాని తర్వాత కూడా ఒక రూపం ఇవ్వాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని,మన రాష్ట్రాన్ని కష్టపడి అభివృద్ధి చేసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు.మాటలకు మాత్రమే పరిమితం కాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు మంత్రి పదవిని సైతం 1969 ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని,అటువంటి మహనీయుల త్యాగాల ఫలితాలు నేటి తరానికి బంగారు బాటలు వేశాయన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక అభ్యున్నతి కొరకు కృషి చేసిన మహనీయుడని,ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని అన్నారు.హైదరాబాద్ రాష్ట్రంలో ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ్యులుగా సేవలు అందించారని,మలిదశ ఉద్యమానికి వేదిక అందించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరంతరం శ్రమించిన మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని అన్నారు.తెలంగాణ ఏర్పాటులో కొండా లక్ష్మణ్ బాపూజీ కృషిని గుర్తించి ప్రభుత్వం ఉద్యానవన విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిందని,అధికారికంగా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు.కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితంలో సమాజ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేశారని,ఆ స్ఫూర్తి మనమంతా తీసుకొని ముందుకు సాగాలని,ఆయన కీర్తిని,చేసిన పనులను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని అన్నారు.అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు,ఇతర ప్రజా ప్రతినిధులు,వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి,పద్మశాలి,బి.సి. కులస్టులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,అన్ని శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఏ. ఓ.,సిబ్బంది,ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.





# వికారాబాద్ జిల్లాలో ఉప్పొంగి ప్రవహిస్తున్న కాగ్న వాగు

- **వాగు పరివాహక ప్రదేశాల్లో పంట నష్టం తీవ్రత అధికం**
- **20వేల ఎకరాలకు పైగా పంటలకు నష్టం**

వికారాబాద్ ( ప్రజాస్వరం): వికారాబాద్ జిల్లాలో ముఖ్యంగా వికారాబాద్ ,మోమిన్ పేట ,మర్పల్లి, బంటారం మండలాల్లో శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని కాగ్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అనంతగిరి కొండల్లో నుంచి పుట్టిన ఈ కాగ్న వాగు వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, ధారూరు, పెద్దేముల్ ,తాండూర్, బషీరాబాద్, యాలాల మండలాల గుండా జిల్లా పరిధిలో దాదాపు 100 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోంది. ఈ వాగు పరివాహక ప్రదేశాల్లో వాగు ఇరువైపులా సాగులో ఉన్న పంట పొలాలకు వరదనీటి వల్ల భారీ నష్టం చేకూరింది. కనీసం 20వేల ఎకరాల విస్తీర్ణంలో వాగు ఇరువైపుల పరివాహక ప్రదేశాల్లో సాగులో ఉన్న పత్తి, కంది తదితర పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తమకు వెంటనే పరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు. శనివారం వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామ పరిధిలో కాగ్న వాగు పరివాహక ప్రాంతంలో జరిగిన నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు రైతులు నష్టం వివరాలు తెలిపారు.





# ఎటిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ సెంటర్ల ద్వారా మీలోని నైపుణ్యాన్ని, బయటికి తీసి మంచి భవిష్యత్తు





- **జిల్ల కలెక్టర్ మను చౌదరి శామీర్ పేట సెప్టెంబర్**

27(ప్రజాస్వరం) ఎటిసి (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) సెంటర్ల ద్వారా మీలోని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసి మీకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఐటిఐ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. శనివారం శామీర్ పేట్ మండలంలో ఐటిఐ కాలేజీలో జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ఎటిసి సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీలోని నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటికి తీసేందుకు ఐటిఐ లను పునరుద్ధరించి నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మారుతున్న టెక్నాలజీకనుగుణంగా మీరు ఆలోచించి ఆవిష్కరణలను రూపొందించాలని అన్నారు. మీరు నేర్చుకునే అంశం గురించి తప్పకుండా మీ తోటి వారితో చర్చించాలని తద్వారా అంశం పై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. మీలోని భయాన్ని విడిచి నలుగురిలో మాట్లాడేలా మిమ్మల్నిమీరు తీర్చి దిద్దుకోవలన్నారు. అందువల్ల భవిష్యత్తులో ధైర్యంగా ఇంటర్వ్యూలలో సమాధానం ఇవ్వగలుగుతారని విద్యార్థులకు హితబోధ చేసారు. చాలా వరకు విద్యార్థులకు ఇంటర్వ్యూలలో థియరీ నాలెడ్జ్ ఉంటుంది కాని ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకపోవడం ద్వారా ఉద్యోగాలు రావడం లేదని, ఈ సమస్యనధిగమించేందుకే ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి నుండి మీరు థియరీ తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. ఎన్ని విషయాలు తెలిసి ఉన్నప్పటికి వాటి గురించి బయటకి చెప్పగలిగినప్పుడే గుర్తింపు వస్తుందని అన్నారు. మీలోని సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోని ఏదో ఉద్యోగం కోసం కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే విధంగా పేద్దగా ఆలోచించాలని విద్యార్థులకు తెలిపారు. మీరు చదివే అంశాల గురించి ఎక్కువగా విశ్లేషణ చేస్తుంటే మీకు కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయని వాటిలో ముఖ్యమైన అంశాల గురించి చర్చించాలని సూచించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి కలెక్టర్ ఎటిసి సెంటర్లోని మిషనరీలకు పూజ చేసారు. అనంతరం కలెక్టర్ ఎటిసి సెంటర్లోని గదులను కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాధిక, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్ లలిత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షా లతో జలదిగ్బంధంలో పలు కాలనీలు గ్రామాలు

- **వికారాబాద్ జిల్లాలో ప్రజలకు వరద కష్టాలు**
- **కాగ్న వాగుకు భారీ వరద కారణంగా తెగిపోయిన కోకట్ ప్రధాన వంతెన**
- **బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామ పరిధిలో గోశాలలో నూట ముప్పై గోవులు మృత్యువాత**
- **వరద పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు**
- **రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

వికారాబాద్ (ప్రజాస్వరం); వికారాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వికారాబాద్ జిల్లాలో సగటున 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రహదారులకు అడ్డంగా ఉన్న వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాలో వరద పరిస్థితి వల్ల ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి.

తాండూరు పట్టణంలోని గ్రీన్ సిటీ, మార్కండేయ కాలనీ నీటిమొంపుకు గురయినాయి. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా ఈ రెండు కాలనీలో వరద నీటిలో మునిగిపోతున్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అలాగే తాండూరు మండలం వీర్ శెట్పల్లి గ్రామానికి ఇరువైపులా ఉన్న కాగ్న వాగు ,జుట్టుపల్లి వాగు రెండు వాగులకు వరద రావడంతో గ్రామం జల దిగ్బంధంలో ఉండిపోయింది. ఈ వాగులకు వరదలు వచ్చినప్పుడు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు.

**జిల్లాలోని తాండూరు నియోజకవర్గం**

**తాండూరు -**

కోకట్ రాసనం మార్గంలో ఉన్న కోకట్ బ్రిడ్జి భారీ వర్షానికి తెగిపోవడంతో ఈ మార్గంలో శనివారం ఉదయం నుంచి రాకపోకలు స్తంభించాయి. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తో పాటు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డిలు, ఇతర వివిధ శాఖల అధికారులు తెగిపోయిన కోకట్ బ్రిడ్జిని పరిశీలించారు. తెగిపోయిన బ్రిడ్జిని పునరుద్ధరించేందుకు చేపట్టవలసిన పనులకు అంచనాలు రూపొందించాలని ,తాత్కాలికంగా బ్రిడ్జిని పునరుద్ధరించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అలాగే తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో కాగిన వాగు ప్రవాహం ఉన్న జీవన్గి, ఇంద్రచెడ్, నవాంధిగీ మంతటి గ్రామాల పరిధిలో జరిగిన పంటల నష్టాన్ని రైతులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి వివరించారు. ఎమ్మెల్యే ఆ గ్రామాల్లో జరిగిన పంటల స్థానాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు జరిగిన నష్టం పై వివరాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. జీవన్ ఈ గ్రామ పరిధిలో భారీ వర్షాల వల్ల ఓ గోశాలలో 130 గోవులు మృతి చెందిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. భారీ వర్షాల వల్ల తాండూరు మండలం కరెంటు భోగిపూర్ మార్గంలో వరద నీటిలో ఓ లారీ వరద నీటిలో చిక్కుకుంది. లారీ డ్రైవర్లు ముజాహిద్, బుద్ధి రాములు వడదనిటిలో చిక్కుకోగా సమాచారం తెలుసుకున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల చేత నీటిలో చిక్కుకున్న డ్రైవర్లను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అలాగే తాండూరు మండలం సంగం కలాం గ్రామ సమీపంలో వరద నీటిలో కార్మికుల బైకులు కొట్టుకుపోయాయి. స్థానిక సిమెంట్ కర్మాగారానికి వెళుతున్న కార్మికులు కొందరు భయపడి వరద నీటిలో విడిచిపెట్టడంతో అవి కొట్టుకుపోయాయి. కాగా తాండూరు పట్టణంలోని పాత కుంట చెరువు దిగువన ఉన్న రైల్వే విద్యుత్ సబ్స్టేషన్, అలాగే గౌతాపూర్ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్స్టేషన్లు వరద నీటిలో మునిగాయి.









# కలెక్టరేట్ లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

- **పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులు..**
- **అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, జిల్లా అధికారులు మహిళలు**





మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం) బతుకమ్మ సంబురాలు శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అంబరాన్ని అంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకకు అట్టహాసపు ఏర్పాట్లు చేశారు. అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లా యంత్రాంగం భాగస్వాములైన ఈ వేడుకతో కలెక్టరేట్ ప్రాంగణం సరికొత్త శోభతో ఉట్టిపడింది. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి, గౌరీ మాతను స్తుతిస్తూ మహిళలు లయబద్ధంగా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మహిళలు ఆలపించిన గేయాల బతుకమ్మ ప్రాశస్త్యాన్ని చాటి చెప్పాయి. ప్రకృతిని ఆరాధించే ఈ వేడుక ఔన్నత్యం ఆవిష్కృతం అయ్యేలా, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అనే తేడా లేకుండా మహిళా ఉద్యోగులు, ఐ కే పీ, మెప్మా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ వేడుకకు వన్నెలద్దారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎంతో ఉత్సాహంగా ఆడిపాడారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ గౌరీమాతకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ ప్రాధాన్యతను ఇనుమడింపజేశాయి. మహిళలు అధికారులు, సిబ్బంది ఎంతో హుషారుగా బతుకమ్మ ఆడుతూ, తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. దేదీప్యమానమైన విద్యుత్ దీపాల వెలుగులలో, అందంగా అలంకరించుకుని నూతన దుస్తుల్లో బతుకమ్మలతో తరలి వచ్చిన అతివలతో కలెక్టరేట్ ప్రాంగణం అంతా సరికొత్త శోభను సంతరించుకుని అందమైన దృశ్యాన్ని ఆవిష్కరింపజేసింది. బతుకమ్మ ఆటపాటలతో ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఈ వేడుకలకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులకు, మహిళలకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ రాహుల్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.







## వరద బాధితులకు అండగా ప్రజా ప్రభుత్వం



- **ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**

మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం) వరద బాధితులకు అండగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఇటీవల మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల వరదల్లో కొట్టుకుపోయిన హవేలి ఘనపూర్ మండలానికి చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున మొత్తం 10 లక్షల చెక్కులను శనివారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంటలు నష్టంతో పాటు ఇతర ఆస్తి నష్టాలపై అధికారులు అంచనా వేశారన్నారు. భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో హవేలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలి

- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

తాండూర్, సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం): అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలి అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణ సమీపంలో శనివారం అధునాతన సాంకేతిక కేంద్రం (ఏ టి సి) నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఏ టి సి సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇవి ఒకప్పటి ఐటీఐలు కావు.. నైపుణ్యానికి, నాణ్యతను అందించే వేదికలు మన ఏటీసీలు అని అన్నారు. నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించే దిశగా ఏటీసీ సెంటర్లఏర్పాటుచేశామన్నారు.తాండూరులో 172 సీట్లకు గాను పూర్తిగా భర్తీ కావడం సంతోషకరం అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రిన్సిపల్ కు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు గత పాలకుల పాలనలో అభివృద్ధి పేపర్లకే పరిమితం అయ్యిందని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.















## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- **జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి**

**వికారాబాద్, సెప్టెంబర్ 27(ప్రజా స్వరం):**
సైబర్ నేరాల పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు జిల్లా సైబర్ వారియర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కార్యాలయం నుండి అందించిన ప్రత్యేక టీషర్టులను జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్లో గల "సైబర్ వారియర్స్ " కి పంపిణీ చేశారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాల ధోరణిని ప్రస్తావిస్తూ ఆన్లైన్ మోసాలు ముఖ్యంగా ఆర్థిక మోసాలు , సోషల్ మీడియా దుర్వినియోగం , గుర్తు తెలియని లింక్‌లు, ఫిషింగ్ వంటి వాటిపై దృష్టి సారించాలి అని తెలిపారు. సైబర్ వారియర్స్ పాత్ర గురించి మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, విద్యా సంస్థలకు అవగాహన కల్పించడంలో వారి క్రియాశీల పాత్ర యొక్క ప్రాముఖ్యతను తెలిపారు .ఇతర సైబర్ నేరాల నుండి ఎలా సురక్షితంగా ఉండాలో ప్రజలకు వివరించాలని తెలిపారు. సైబర్ వారియర్‌లకు స్థాయి శిక్షణ అవసరాలపై అభిప్రాయాలు తీసుకోవడం. డిజిటల్ ఫోరెన్సిక్స్ , నేర పరిశోధనా పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు శిక్షణ అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## రాష్ట్ర సాధనకు పోరాట బాటలు వేసిన మహానీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

- **వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**

**వికారాబాద్, (ప్రజాస్వరం) :**
ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణా ఉద్యమ కారకులు, స్వాతంత్ర్యఉద్యమములో చురుకుగా పాల్గొన్నారని, ప్రతి ఒక్కరు అయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశము హాలు నందు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి , డి ఆర్ ఓ మంగీలాల్ తో కలిసి జ్యోతి ప్రజల్వన గావించి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడుగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ముఖ్య పాత్ర పోషించారని, వారి సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 1969వ సంవత్సరంలో తొలి దశ పోరాటం లోనే కీలక పాత్రా పోషించి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అండగా దీక్షను చేయడమే కాకుండా తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకై పోరాడిన యోధుడు ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తనకంటూ ఏమి లేకుండా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి సమావేశాలు ఏర్పాటు చేసుకొనుటకు తన యొక్క ఆస్తులు మొత్తం కూడా దానం చేసిన త్యాగశీలి, ఆయన తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు మరియు బడగు బలహీన వర్గాలు అభివృద్ధి చేందాలని ఆశించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల సేవలను గుర్తించి అనేక కార్యక్రమాలను అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి మాధవ రెడ్డి ,డి టి డి ఓ కమలాకర్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, పంచాయత్ రాజ్ ఈ ఈఉమేష్ కుమార్, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా అధికారులు కల్లెక్ట్రేట్ సిబంది , తదితరులు పాల్గొన్నారు.



## కొలిచిన వారికి కొంగు బంగారమై



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) :**
శరణ్య నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని పాపన్న గడ్డ ప్రాంతంలో పుణ నిర్మాణం చేసిన దుర్గ భవాని ఆలయంలో అమ్మవారు భక్తులకు కాత్యాయని రూపంలో దర్శనం ఇవ్వడం జరిగింది అమ్మవారికి ప్రత్యేక పూజలు పాల్గొన్న ముత్యంగారి అనిత నవీన్ కుమార్, ఉపాధ్యాయులు విస్లావత్ సరోజ దేవి సింగ్ లు అమ్మవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అదే మాదిరిగా మండల వ్యాప్తంగా మండపాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది. భక్తులకు అమ్మవారు కాత్యాయని దేవి అవతారంలో అలంకరింపబడి భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం పున్యాహ వాచనం, ప్రత్యేక పూజలు, సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు చండీ హోమం, లలితాసహస్ర నామ పారాయణం నిర్వహించగా, వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి కటాక్షం పొందారు. మహిళలు విస్తృతంగా పాల్గొని అమ్మవారికి ఇష్టమైన పసుపు రంగు వస్త్రాలు, పూలు, నైవేద్యాలు సమర్పించారు. కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. సాయంత్రం దీపారాధన, మంగళహారతి ఘనంగా నిర్వహించగా, ఆలయ ప్రాంగణం "జై మాతా దీ" నినాదాలతో మార్మోగింది. కాత్యాయని దేవి రూపాన్ని దర్శించుకోవడం ద్వారా భక్తులు తమ కష్టాలు తొలగిపోతాయని, కుటుంబాల్లో శాంతి, సౌఖ్యం నెలకొంటాయని విశ్వాసం ఉంది. యువతులు మంచి వరుడు లభించాలనే కోరికతో ప్రత్యేక పూజలు చేశారు.




## ఆశావాహులు ఆశలు గల్లంతు ఎట్టకేలకు రిజర్వేషన్లు ఖరారు

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 27(ప్రజాస్వరం) :**
స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లను ప్రకటించడం దౌల్తాబాద్ మండల రాజకీయ వాతావరణంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులపై ఇప్పటికే ఎవరు బరిలోకి దిగుతారో, ఎవరు విజయం సాధిస్తారోనన్న హడావిడి రాజకీయ వర్గాల్లో నెలకొంది. అయితే, రిజర్వేషన్ విధానం వెలువడగానే అనేకమంది స్థానిక నాయకుల కలలు చిద్రం అయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన నిబంధనల ప్రకారం బీసీలకు కేటాయించిన శాతం పెరగడంతో, ఇప్పటివరకు బలంగా పోటీకి సిద్ధమైన అనేక మంది నేతలకు అవకాశాలు దూరమయ్యాయి. దీంతో వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. “మేమే జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అవుతాం” అంటూ గ్రామాల్లో, మండల పరిధిలో ప్రజలతో అనుబంధాలు పెంచుకుంటూ ఎన్నికలకు ముమ్మరంగా సిద్ధమవుతున్న నాయకుల ఆశలు ఒక్కసారిగా గల్లంతయ్యాయి. కొంతమంది నేతలు దీనిని ప్రజాస్వామ్యానికి అనుకూలంగానే భావిస్తున్నప్పటికీ, తమకు దక్కని అవకాశం పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు మాత్రం రిజర్వేషన్ విధానం వల్ల తమ కులానికి ప్రాతినిధ్యం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతలోనే రాజకీయ లెక్కలు మారిపోవడంతో కొత్త వర్గాల నుంచి బలమైన నాయకత్వం ముందుకు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. రాబోయే రోజుల్లో రిజర్వేషన్ లెక్కల ఆధారంగా కొత్తగా ఎవరు రంగప్రవేశం చేస్తారు, ఎవరు వెనక్కు తగ్గుతారు అనేది ఆసక్తికరంగా మారింది.

## ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలి

- **వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్**

**వికారాబాద్, సెప్టెంబర్ 27(ప్రజా స్వరం):**
భారీ వర్షాల వల్ల వికారాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిలిందని కొన్ని ప్రదేశాల్లో పంటలకు విధ్వంసం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మర్పల్లి మండలం రావులపల్లి గ్రామంలో.. దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్టులను వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శనివారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వందలాది ఎకరాల్లో నీట మునిగి పత్తి, కంది తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది అని తెలిపారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భారీ పంట నష్టం వాటిల్లింది. గత కొద్ది రోజులుగా జిల్లాలో కురుస్తున్న వాన జిల్లాను అతలాకుతలం చేసింది అని అన్నారు. భారీ వర్షాల ప్రభావంతో పంటలు ముంపుకు గురై, ఎందుకు పనికిరాకుండా మారి రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి అని అన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల గ్రామాలలో రవాణా వ్యవస్థ దెబ్బతింది, రోడ్లు ధ్వంసమయ్యాయి. రవాణా స్తంభించిపోయి జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లు జలమయం కావడంతో పాటు, వాగులు పొంగిపొర్లడం వల్ల కల్వర్టులు కొట్టుకుపోయి రవాణా మార్గాలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్ష తీవ్రతకు చాలా ఇండ్లు శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి, కొన్నిచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భూమికి 7 ఫీట్ల లోపల ఉన్న మిషన్ భగీరథ పైపులు సైతం వరద తీవ్రతకు కొట్టుకుపోయి గ్రామాల్లో మంచి నీరు లేక ప్రజలు అత్యంత దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు అని అన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లతో సహా కొట్టుకుపోయాయి, గ్రామాల్లోని ప్రజలు చిమ్మ చీకట్లో భయం భయంగా బతుకుతున్నారు అని తెలిపారు.



వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన ప్రతి రైతన్నకు ఎకరానికి రూపాయలు 25 వేలు పంట నష్టపరిహారం చెల్లించాలి అని అన్నారు. నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్ట పరిహారం అందించడంలో జాప్యం చేస్తే ఊరుకునేది లేదు, పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆందోళనలు చేపడతాం అని అన్నారు. స్పీకర్ వెంటనే నియోజకవర్గంలోని ముంపు గ్రామాల్లో పర్యటించి, పరిస్థితిని సమీక్షించి, రావాణ వ్యవస్థను పునరుద్ధరించడానికి తగిన చర్యలు చేపట్టాలి. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు అందాల్సిన పంట నష్టం జాప్యం లేకుండా అందేలా చూడాలి. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి అని అన్నారు.

## ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్స్ విడుదల

**మెదక్, సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం) :**
మెదక్ జిల్లా లో జడ్పీటీసీ, ఎంపీపీ ల రిజర్వేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా లో ఉన్న 21 మండలాల పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీపీ ప్రక్రియ పూర్తయింది. జిల్లా లోని 21 జడ్పీటీసీ ల రిజర్వేషన్ లో చిలిప్ చెడ్. (ఎస్టీ మహిళ), టెక్మాల్(ఎస్టీ జెనరల్), మాసాయిపేట. (ఎస్సీ మహిళా) నార్సింగి. (ఎస్సీ. జెనరల్) అల్లదుర్గ్ (ఎస్సీ జెనరల్), వెల్దుర్తి. (ఎస్సీ మహిళా), కౌడిపల్లి ( బీసీ జెనరల్), నర్సాపూర్ (బీసీ మహిళ), చేగుంట (బీసీ మహిళా) పాపన్న పేట్ (బీసీ జెనరల్), మెదక్ (బీసీ జెనరల్), చిన్న శంకరంపేట(బీసీ జెనరల్), రేగోడ్ (బీసీ మహిళ), హవేలీ ఘనపూర్ (బీసీ జెనరల్), శివ్వంపేట (బీసీ మహిళ), పెద్ద శంకరంపేట్ (ఓసీ మహిళ), మనోహరాబాద్ (ఓసీ మహిళ), తూప్రాన్ (ఓసీ జెనరల్), నిజాంపేట్ (ఓసీ మహిళ), కుల్చారం (ఓసీ జనరల్), రామాయంపేట( ఓసీ జనరల్) కేటాయించినట్లు తెలిసింది. జిల్లాలోని 21 ఎంపీపీ ల రిజర్వేషన్ లో చిలిప్ చెడ్ (ఎస్టీ మహిళ), టెక్మాల్ (ఎస్టీ జెనరల్), మాసాయిపేట. (ఎస్సీ మహిళా), నర్సింగ్ (ఎస్సీ జెన రల్), అల్లదుర్గ్. (ఎస్సీ మహిళా), వెల్దుర్తి (ఎస్సీ జెనరల్), కౌడిపల్లి (బీసీ మహిళా), నర్సాపూర్. (బీసీ జెనరల్), చేగుంట (బీసీ మహిళా), పాపన్న పేట్. (బీసీ జెనరల్), మెదక్. (బీసీ జెనరల్), చిన్న శంకరంపేట. (బీసీ జెనరల్), రేగోడ్. (బీసీ జెనరల్), హవేలీ ఘనపూర్. (బీసీ మహిళా), శివ్వంపేట. (బీసీ మహిళా), పెద్ద శంకరంపేట్ (ఓసీ మహిళా), మనోహరాబాద్. (ఓసీ జెనరల్), తూప్రాన్. (ఓసీ జెనరల్), నిజాంపేట్. (ఓసీ మహిళా), కుల్చారం. (ఓసీ జెనరల్), రామాయంపేట. (ఓసీ మహిళ) కేటాయించినట్లు తెలిసింది.

# తాండూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18 మద్యం దుకాణాలకు టెండర్లు

- తాండూర్ ఎక్సైజ్ ఇంచార్జ్ సి ఐ ఆదిశేషిరెడ్డి

**తాండూరు, సెప్టెంబర్ 27(ప్రజా స్వరం):**




తెలంగాణలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది అని తాండూర్ ఎక్సైజ్ ఇంచార్జ్ సి ఐ ఆదిశేషిరెడ్డి తెలిపారు.సెప్టెంబర్ 26తేదీ నుండి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుంది అని, అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయింపు సంబంధిత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉంటుంది అని తెలిపారు. కొత్త దుకాణాలకు 2025 డిసెంబర్ 1 నుండి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితి ఉంటుంది అని తాండూర్ ఎక్సైజ్ ఇంచార్జ్ సి ఐ ఆదిశేషిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తాండూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల 18 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించడం జరుగుతుంది. కావున ఆసక్తి గలవారు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేయవలసిందిగా తాండూర్ ఎక్సైజ్ ఇంచార్జ్ సి ఐ ఆదిశేషిరెడ్డి తెలిపారు. ఈ 18 మద్యం దుకాణాలలో 5 ఎస్ సి(తాండూర్ టౌన్ -3, కోట్పల్లి-1 మరియు మల్కాపూర్-1), 2 గౌడ (తాండూర్ టౌన్-1 మరియు బాగాయిపల్లి-1) సామాజిక వర్గాలకు మరియు మిగతా 11 మద్యం దుకాణాలు ఓపెన్ క్యాటగిరిలుగా నిర్ణయించడం జరిగింది. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం వికారాబాద్ లేదా హైదరాబాద్ నాంపల్లి ఎక్సైజ్ హెడ్ ఆఫీస్ లో దరఖాస్తు చేయవలసిందిగా కోరారు. టెండర్ ఫీజు రూ.3 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

# ముత్తారం ఎస్సై గా రవికుమార్ బాధ్యతలు స్వీకరణ.

**ముత్తారం/పెద్దపల్లి,సెప్టెంబర్27(ప్రజా స్వరం):**




ముత్తారం మండల నూతన ఎస్సై గా ఎన్. రవికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘతం కలిగించవద్దని మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.అసాంఘిక కార్యక్రమాలు,జూదం,అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.రాబోయే దసరా పండుగ శాంతిభద్రతతో జరుపుకోవాలని ఏలాంటి అవాంచనియ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని అన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 27 ప్రజాస్వరం**

దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని గాజులపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, స్వచ్ఛందకారులు పాఠశాల ఆవరణను శుభ్రపరచడంతో పాటు చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచే పనిలో పాల్గొన్నారు. చిన్నారులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి మాట్లాడుతూ పరిశుభ్రత అంటే ఆరోగ్యం, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కూడా సమాజానికి ఆదర్శంగా నిలిచి ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. గ్రామస్థులు విద్యార్థుల ఈ సేవాభావాన్ని అభినందిస్తూ, ఇలాంటి శ్రమదాన కార్యక్రమాలు తరచుగా జరిగితే గ్రామం మరింత అందంగా మారుతుందని అన్నారు.




# అన్నదానం... మహాదానం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 27(ప్రజాస్వరం)**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ దుర్గా భవాని ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నప్రసాద కార్యక్రమానికి దాతృత్వం వహించిన వారు డాకొల్ల లావణ్య ఆంజనేయులుగౌడ్ దంపతులు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించడం ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారి, భజనలతో, నినాదాలతో ఉత్సవ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భక్తుల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు అద్భుతంగా జరుగుతున్నాయని, రోజువారీగా విభిన్న దాతలు ముందుకు వచ్చి అన్నప్రసాద దాతృత్వం వహిస్తున్నారని తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నరు. దుర్గ భవాని ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# రంగురంగుల పువ్వులతో ఆడపడుచుల బతుకమ్మ వేడుకలు

- రంగురంగుల పువ్వులతో ఆడపడుచుల బతుకమ్మ వేడుకలు
- కేఎల్ఆర్ వెంచర్ లో గల రోడ్ నెంబర్ 7లో బతుకమ్మ సంబరాలు
- పాల్గొన్న కాలనీ ఆడపడుచులు

**మేడ్చల్, ప్రజాస్వరం) :**

తెలంగాణ రాష్ట్ర మహిళలు బతుకమ్మ పండుగను ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారని మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్లో గల రోడ్ నెంబర్ 7లో బతుకమ్మ సంబరాలు జరుపుకున్న పలువురు ఆడపడుచులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు నంబర్ 7లో గల మహిళలు రంగురంగుల పువ్వులతో తయారుచేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆడపడుచులంతా తయారుచేసిన రంగురంగుల బతుకమ్మలను ఒక చోటికి చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని ఆడపడుచులు అంత పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.





# ఏసీబీ అధికారులకు చిక్కిన రాధాకృష్ణారెడ్డి

**మేడ్చల్, (ప్రజా స్వరం):**

బాధ్యత గల హోదాలో ఉండి తప్పు జరిగే చోట తప్పును సరిదిద్దేలా చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన అధికారి చట్టానికి విరుద్ధంగా రూ.3 లక్షల 50 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఎల్లంపేట పురపాలక సంఘం ఇన్చార్జి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణ రెడ్డి శనివారం ఉదయం పట్టుపడ్డాడు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ఓ వెంచర్ కు హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నప్పటికీ వెంచర్ నిర్వాహకులు వెంచర్ చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడలు కూల్చకుండా ఉండటానికి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డి సంబంధిత వెంచర్ నిర్వాహకుల వద్ద నుంచి రూ. 5 లక్షలు ఇవ్వాలని, లేదంటే ప్రహరీ గోడలు, మెయిన్ గేట్ కూల్చివేస్తానని తెలపడంతో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణారెడ్డికి వెంచర్ నిర్వాహకులు ముందస్తుగా రూ. లక్ష ఇవ్వగా మిగిలిన రూ. నాలుగు లక్షల విషయంలో వెంచర్ నిర్వాహకులు గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో శనివారం ఉదయం కొంపల్లిలోని రాధాకృష్ణారెడ్డి ఇంటి సమీపంలో ఉన్న రాయచందిని మహల్ వద్ద రూ.3 లక్షల 50 వేల నగదును కారులో వచ్చిన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రాధాకృష్ణ రెడ్డి తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రాధాకృష్ణ రెడ్డి ఎడమ చేతికి ఫినోప్తిలిన్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్ రావడంతో లంచం తీసుకున్నట్లు నిర్ధారణ కాగా సదరు అధికారిని ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయానికి తీసుకొచ్చి విచారించిన అనంతరం లంచం తీసుకున్న అధికారి కారు సీజ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.



**ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే కాల్ చేయండి :**

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలను లంచం డిమాండ్ చేసినా, వేధించినా వెంటనే డయల్ 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయంలో లంచం ఇవ్వకండి మాకు సమాచారం ఇవ్వండి అనే పోస్టర్ను కార్యాలయ భవనానికి అతికించారు.

# జీఎస్టీ సంస్కరణల తో తెలంగాణ ప్రజలకు 5–6 లక్షల కోట్ల లాభం

**హైదరాబాద్ సెప్టెంబర్ 27 (ప్రజాస్వరం) :**

జీఎస్టీ సంస్కరణల తో తెలంగాణ ప్రజలకు 5-6 లక్షల కోట్ల లాభం జరిగిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. పార్టీ కార్యాలయం లో మీడియా తో మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల ద్వారా, దసరా - దీపావళి పండుగల సందర్భంగా భారతదేశంలోని 30 కోట్ల కుటుంబాలు ప్రత్యక్ష లబ్ధి పొందాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి మరియు ఉన్నత తరగతి కుటుంబాలకు ₹10,000-₹35,000 వరకు లబ్ధి లభించిందని వివరించారు.తెలంగాణ ప్రజలకు మాత్రమే దాదాపు 5-6 లక్షల కోట్ల లాభం జరిగిందని చెప్పారు.కాంగ్రెస్ నేతలు సొల్లు ప్రచారం చేస్తూ 7,000 కోట్ల నష్టం జరిగిందని భ్రమ కల్పిస్తున్నారని, కానీ వాస్తవానికి తెలంగాణకు 14,000 కోట్ల లాభం వచ్చిందని తెలిపారు. జీఎస్టీలో 50% రాష్ట్రానికి, 50% కేంద్రానికి వస్తుందని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీ గబ్బర్ సింగ్ అని ఎద్దేవా చేసినా, ఈరోజు మోడీ తెచ్చిన "సూపర్ జీఎస్టీ" వల్ల ప్రతి ఇంటికి "ఘర్ ఘర్ సురక్ష" లభిస్తోందని అన్నారు.బిఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అబద్ధమని, 11 సంవత్సరాలుగా మోడీ 11,350 లక్షలకోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినా అవినీతి రహిత నాయకత్వం చూపారని స్పష్టం చేశారు.కల్వకొట్ల కుటుంబం రాజకీయ అవినీతికి బ్రాండ్ అంబాసిడర్,మోడీ గారు హానెస్ట్ పాలిటిక్స్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని స్పష్టం చేశారు."మోడీ గారు ఇచ్చిన జీఎస్టీ కానుక దసరా - దీపావళి సందర్భంగా ప్రతి ఇంటికి చేరింది. ప్రజల గుండెల్లో మోడీ గారి నామస్మరణం జరుగుతోంది" అని డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు.



# ఘనంగా సీఎస్ఐ ఫార్మేషన్ డే వేడుకలు....

మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం) సీఎస్ఐ ఫార్మేషన్ డే పురస్కరించుకుని శనివారం మెదక్ సీఎస్ఐ చర్చ్ లో సంబరాలు అంబరాన్ని అంటాయి.. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చ్ లో మెదక్ ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ఆధ్వర్యంలో ఫార్మేషన్ డే వేడుకలు వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మెదక్ చర్చ్ నుండి రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనల్లో మోడరేటర్, మెదక్ ఇంచార్జ్ బిషప్ రేవ్. డా. కే. రూబెన్ మార్క్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం చర్చ్ ప్రాంగణంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన చర్చ్ సభ్యులు, మహిళలు యేసయ్య పాటలు పాడుతూ, నృత్యాలతో పాటు మరి కొందరు కోలాటాలు ఆడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో డయాసిస్ వైస్ చైర్మన్ విల్సన్, డయాసిస్ మినిస్ట్రల్ సెక్రటరీ జయనంద్, డయాసిస్ లే సెక్రటరీ ప్రభు కిరణ్, సీఎస్ఐ సినార్డ్ ట్రెజర్ విమల్ సుకుమార్, చర్చ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఆధునిక సాంకేతికత కూడిన పరిజ్ఞానం అవసరం...
- 6 ట్రేడుల్లో విద్యార్థులకు శిక్షణ....
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు...
- ఏటిసి నీ ప్రారంభించిన ఎమ్మెల్యే...

**మెదక్ సెప్టెంబర్ 27 (ప్రజా స్వరం)**



నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం హవేలి ఘనపురం మండల పరిధిలో నూతనంగా రూ 43 కోట్లతో ఏర్పాటుచేసిన అడ్వాన్స్ టెక్నాలజి సెంటర్ (ఏటిసి) ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగాల కోసమే తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. యువతకు నైపుణ్యంతో పాటు నాణ్యతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఉపాధి అవకాశాలు కల్పనకు ఆధునిక సాంకేతికత కూడిన పరిజ్ఞానం చాలా అవసరమని తెలిపారు. ఏటిసి కేంద్రాల ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు పరిశ్రమలతో పాటు ప్రయివేటు రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఏటిసి కేంద్రానికి 43 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏటిసి కేంద్రంలో 6 ట్రేడుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించి తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ మిమ్మల్ని చదివిస్తున్నారని ప్రయోజకులై తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో హవేలి ఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, మాజీ మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ గౌడ్, నాగరాజు టీజీఐఐసి జోన్ మేనేజర్ శ్రీవాణి ఏటీసీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999